క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌కు సన్మానం



కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను బుధవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన సంఘం నాయకులు శివప్రసాద్ శాలువాతో సత్కరించారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని కోరారు.

ఆస్తిపన్నులో రాయితీ

కొల్లాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పెండింగ్‌లో ఉన్న ఆస్తి, నల్లా పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఆస్తి పన్నులు ఈనెలాఖరు వరకు చెల్లించేవారికి పన్ను మొత్తంలో 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

సైనిక్ స్కూల్‌కు నల్లమల విద్యార్థులు ఎంపిక



అభిరాం



అక్షిత్

అచ్చంపేట రూరల్: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌కు నల్లమల విద్యార్థులు ఎంపికయ్యారు. పట్టణంలోని జీఎస్‌ఆర్ ఆదిత్య స్కూల్ చెందిన గిరిజన విద్యార్థి అభిరాం ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి ఆంధ్రప్రదేశ్‌లోని కలికిరి సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ హాలరాజు తెలిపారు. అలాగే కృష్ణవేణి స్కూల్‌కు చెందిన అక్షిత్ గుజరాత్‌లోని బాలచడి సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు స్కూల్ యాజమాన్యం తెలిపారు.

సాధారణ కాన్పులకు ప్రాధాన్యం

కోడేరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇస్తారని డాక్టర్ దశరథం అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తప్పనిసరిగా సబ్‌సెంటర్ల వద్ద అందుబాటులో ఉండి సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు అయ్యేలా చూడలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ కార్యవర్గ సభ్యుడిగా శేఖర్



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు శేఖర్‌ను ఆ పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా బుధవారం నియామకం అయ్యారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ విజయం కృషి చేస్తానని శేఖర్ పేర్కొన్నారు.

పాడి రైతుకు పరిహారం అందజేత



అచ్చంపేట రూరల్: మండలంలోని గుంపన్‌పల్లికి చెందిన పాడి రైతు ధాక్యకు సంబంధించిన ఆవును ఇటీవల చిరుతపులి దాడి చేసి చంపింది. ఈ మేరకు బుధవారం పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం ఆవరణలో అటవీశాఖ అధికారులు పరిహారం అందజేశారు. రూ. 13 వేలు డీడీ రూపంలో ఇన్‌చార్జ్ రేంజ్ ఆఫీసర్ వీరేష్ రైతుకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సాధిక్, ఎఫ్‌బీఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని 10వ వార్డుకు చెందిన బోయ బిచ్చినాయుడు(58) అనారోగ్యంతో సోమవారం రాత్రి మరణించారు. మంగళవారం బిచ్చినాయుడు మృతదేహానికి మాజీ మార్కెట్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కట్టా శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి వెంట రైతు సంఘం నాయకులు బరిగెల సత్యనారాయణయాదవ్, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్‌నాయుడు, పేపర్ శ్రీనుతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



కల్వకుర్తి ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: విధుల్లో వైద్యుల నిర్లక్ష్యంపై కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని సీహెచ్‌సీని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి విభాగంపై ఫిర్యాదులు అందుతున్నాయని తీరు మార్చుకోవాలని వైద్యులను ఆయన సూచించారు. భవిష్యత్‌లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని, మరోసారి ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తానని హెచ్చరించారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ ఎండాకాలంలో వడదెబ్బ తగిలి ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని దీనికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపాలిటీ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల, నాయకులు ఉన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని అన్ని వార్డులలో ముస్లింలకు రంజాన్ తోఫాను ఎమ్మెల్యే నారాయణరెడ్డి పంపిణీ చేశారు. బుధవారం మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ 600 మంది ముస్లింలకు తోఫాను సమకూర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని ముస్లింలను కోరారు.

గోపిరెడ్డి సుధాకర్‌రెడ్డికి నివాళి

నేతాజీ క్లబ్ మాజీ సభ్యుడు గోపిరెడ్డి సుధాకర్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై మార్కెట్ వద్ద గోపిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అమ్రాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలందరికి పనులు కల్పించాలని ఎంపీడీఓ మోహన్‌లాల్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్‌హాల్‌లో బుధవారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు రివ్యూ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న పనులు, ఉపాధి కూలీలకు అందుతున్న పేమెంట్‌పై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సకాలంలో కూలీ డబ్బులు రావడం లేదని, కొంత మంది వివిధ కారణాలతో పనులకు రావడం లేదని తన దృష్టికి వచ్చిందని వివరించారు. అందరూ సమన్వయంతో కూలీలందరికీ పనులు కల్పించే విధంగా, సకాలంలో డబ్బులు అందే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఓ రఘు తదితరులు ఉన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



అచ్చంపేటలో పండ్లు తినిపిస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్



వటువర్లపల్లిలో ..

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్రలో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి ముస్లింలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. బుధవారం పటణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి సరుకులు అందజేశారు. రంజాన్ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ప్రశాంతవాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.

అచ్చంపేట రూరల్: రంజాన్ పండుగను పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ ముస్లింలకు పండ్లు, హలీం పంపిణీ చేశారు. పట్టణంలోని నాలుగు ప్రధాన మసీద్‌ల వద్ద ముస్లింలక అందజేశారు. కార్యక్రమంలో సిద్ధిఖ్, అన్వర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామ ముస్లింలకు మాజీ సర్పంచ్ చత్రునాయక్ రంజాన్ తోఫా పంపిణీ చేశారు. మొత్తం 9 రకాల నిత్యవసర సరుకులతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీను, పరమేశ్వర్, సూర్యం, సాధిక్, జాంగీర్, నీరంజన్, బాలస్వామి, మల్లి, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ

తాడూరు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఏపీఓ చంద్రసిద్దార్థ అన్నారు. బుధవారం మండలంలోని చర్లిటిక్యాల నర్సరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి కూలీలకు నర్సరీల నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున నర్సరీలలో పెంచిన మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నీటిని పట్టాలని సూచించారు. ప్రతి మొక్క ఎండకుండా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్



వాలీబాల్, నెట్ అందిస్తున్న వేణుగోపాల్

కల్వకుర్తిరూరల్: క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, స్నేహభావం పెంపొందుతుందని యువజన సంఘాల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లికట్టలో మన సేవా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు వాలీబాల్ సామగ్రిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో దేహదారుఢ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, రవీందర్, పవన్, లాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలలో మొదటి బహుమతి పొందిన వృషభరాజాలు

లింగాల: మండలంలోని దారారంలో ఉగాది పర్వదినం సందర్భంగా గ్రామ రైతు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా నలుమూలల నుంచి 23 ఎద్దుల జతలు పాల్గొన్నట్లు నిర్వాహకులు పాత్లావత్ రవి, చంటి, శ్రీశైలం, ఎల్ శ్రీనివాసులు తెలిపారు. మొదటి బహుమతి అమ్రాబాద్ మండలం ఎల్మపల్లి గ్రామానికి చెందిన కడారి బాలయ్యకు రూ.20 వేలు , ద్వితీయ బహుమతి లింగాల మండలానికి చెందిన గాలేటి నారాయణస్వామి రూ.15 వేలు, తృతీమ బహుమతి లింగాల మండలానికి చెందిన బైకని సైదులు, గడ్డం కాశీం రూ.10 వేలు అందుకున్నారు. అనంతరం దాతలను నిర్వాహకులు సన్మానించారు.

ఘనంగా విమలరణధివే జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మహిళల హక్కుల కోసం సామాజికంగా, రాజకీయంగా పోరాటం చేసిన గొప్ప యోధురాలు విమలరణధివే అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం విమలరణధివే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం అనేక ఉద్యమాలు నడిపిన చరిత్ర విమలరణధివేకు దక్కుతుందన్నారు. ఆమె అడుగుజాడల్లో యువత నడవాలని కోరారు. కార్యక్రమంలో పాదిలరామయ్య, అశోక్, బాలస్వామి, వెంకటయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

అకస్మాత్తుగా చెలరేగిన మంటలు



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సమీపంలోని భ్రమరాంబిక మల్లికార్జున బీఈడీ కళాశాల, రాఘవేంద్ర పెట్రోల్ పంపు దారి మధ్యలో బుధవారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున చెలరేగడంతో ప్రజలు భయాందోళన చెందారు. పెట్రోల్ బంక్‌లో మంటలు అంటుకునట్లు ప్రచారం కావడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు ఘటన స్థలానికి చేరొకొని మంటలను ఆర్పారు. ఫైర్ ఆఫీసర్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పెట్రోల్ పంపులో ఎలాంటి సమస్య లేదని సమీపంలో చెత్తాచెదారం అంటుకొని మంటలు చెలరేగాయని ఆయన పేర్కొన్నారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని నాగనూల్‌లో ఫ్రెండ్స్ సేవ సంఘం ఆర్థిక స్తోమత లేని పేదల కుటుంబాలకు అండగా నిలిచింది. బుధవారం 12 మంది కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించినట్లు ఫ్రెండ్స్ సేవా సంఘం సభ్యులు పేర్కొన్నారు. అలాగే అన్నదానం చేశారు.

అనాథ విద్యార్థులకు దుస్తులు పంపిణీ



అచ్చంపేట రూరల్: పట్టణంలోని వనవాసి కల్యాణ పరిషత్‌లో చదువుకుంటున్న అనాథ చెంచు విద్యార్థులకు బుధవారం అచ్చంపేటకు చెందిన రాజు ఉగాది పండుగను పురస్కరించుకుని దుస్తులు అందజేశారు. 40 మంది చెంచు విద్యార్థులకు మూడు జతల చొప్పున దుస్తులు అందజేసి ఒకపూట భోజనం ఏర్పాటు చేశారు. తాత, అమ్మమ్మల జ్ఞాపకార్థకంగా దుస్తులు పంపిణీ చేసినట్లు రాజు పేర్కొన్నారు.

ట్రాక్టర్ రివర్స్ పోటీలు



లింగాల: ఉగాది పర్వదినం పురస్కరించుకొని మండలంలోని అంబట్‌పల్లిలో బుధవారం ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించారు. పోటీలలో 12 మంది డ్రైవర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ.2,500 జాగ మల్లేష్ గెలుపొందగా, రెండో బహుమతి రూ.1,500 కిరణ్‌గౌడ్, మూడో బహుమతి రూ.1000లు తులసి ఉపేందర్ గెలుపొందారు.

‘ఎంపీగా ఆశీర్వదించండి’



కొట్రలో ప్రచారం చేస్తున్న భరత్‌ప్రసాద్, ఆచారి

వెల్దండ: బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని జాతీయ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొట్ర, పోతేపల్లి, ఎంపీతండా, చెదురుపల్లి, దుబ్బతండా తదితర గ్రామాల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌తో కలిసి ఆచారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆచారి, భరత్‌ప్రసాద్‌లు మాట్లాడుతూ దేశంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. భారతదేశం అగ్రగామిగా నిలవాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, బాలస్వామి, జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి, యాదగిరి, వెంకటయ్య, శ్రీనివాసచారి, మధుసూధన్‌రెడ్డి ఉన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం



మాట్లాడుతున్న అధ్యక్షుడు సీఈఓ ఆంజనేయులు

తాడూరు: రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీఈఓ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని తుమ్మలసూర్, బలాన్‌పల్లి, పాపగల్, శిర్సవాడ, ఎటిదారిపల్లి, ఆకునెల్లికుదురు, అల్లాపూర్, కుమ్మెర, చర్లిటిక్యాల, గుంతకోడూరు గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వరి పంటకు కనీసం మద్దతు ధర రైతులు పొందాలంటె ప్రభుత్వం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి చెత్త, తాలు, మట్టిపెడ్డలు, రాళ్లు లేకుండా శుభ్రపర్చాలన్నారు. క్వింటాలుకు ఏ గ్రేడ్ రూ.2203లు, బీ గ్రేడ్ రూ.2183లు మద్దతు ధర ప్రభుత్వం ఇస్తుందన్నారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులు తమ ఫోన్ నంబర్‌తోపాటు ఆధార్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌తో అనుసంధానం అయి ఉండాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించే సమయంలో ఓటీపీ నంబర్ కోసం రైతులు తమ సెల్‌ఫోన్‌ను తమ వద్దనే ఉండేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ఆధార్‌కార్డు, ఏఓ ధ్రువీకరణ పత్రం, పట్టదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటివి తప్పనిసరి ఉండాలన్నారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లిలో స్వర్గీయ రమేష్ యాదవ్ స్మారకార్థం ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 7, 8, 9, తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 10 జట్టు పాల్గొన్నాయి. విజేతగా సింగోటం, రెండో స్థానంలో జడ్చర్ల జట్లు నిలిచాయి. నిర్వాహకులు మాస్టర్ శరబంద, విద్యార్థి బృందం సభ్యులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ ఉదురు శ్రీనివాసులు, సొడయ్య, బాలయ్య తదితర విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలను తప్పక పాటించాలి

పాన్‌గల్: వడదెబ్బ తగలకుండా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలు తప్పక పాటించాలని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని కదిరెపాడు, గన్యానాయక్‌తండా, గురిగింజమిట్టతండాల్లో ఆయన వైద్య సిబ్బందితో కలిపి పర్యటించి వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంపిణీ చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఒక లీటర్ నీటిలో కలుపుకొని తాగాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున బయటికి వెళ్లొద్దని, అత్యవసర సమయంలో బయటికి వెళితే టోపి, గొడుగు, రుమాలు తప్పక ధరించాలన్నారు. ఏఎన్ఎం సుమిత్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవంచలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ గ్రామం వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్లకు మొదటి రోజు విశ్వక్సేన ఆరాధన, పణ్యాహావాచనం, మృత్యున్ గ్రహణం తదితర పూజలు నిర్వహించారు. గ్రామ వీధులలో స్వాగత తోరణాలు కట్టారు. కాలనీలలో గ్రామస్తుల సందడి కనిపించింది.

ప్రమాదకర గుంతను పూడ్చండి



చారకొండ: మండలంలోని జూపల్లిలో ఎనిమిదో వార్డులో గుంత ప్రమాదకరంగా దర్శనిమిస్తోంది. డ్రెయినేజీ మరమ్మతు కోసం తవ్విన గుంత పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది. గతంలో పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. ప్రధానవీధి మార్గమధ్యలో గుంత ఉండటంతో వాహనదారులు, చిన్నారులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి శ్రద్ధ వహించి గుంతను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



బిజినేపల్లి: నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తిమ్మాజిపేట ఏఓ కమల్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు వ్యవసాయ దుకాణాల్లో ఆయన తనిఖీలు చేపట్టి, రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వాహణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులను విక్రయించాలన్నారు. ధరల పట్టిక ఏర్పాటు చేయాలని డీలర్లను కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలన

అచ్చంపేట: పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని మధురానగర్ కాలనీలోని ఈద్గా వద్ద మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహ్మగౌడు, మున్సిపల్ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. సామూహిక ప్రార్థనలు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు సిద్దిక్, ఖుతద్దీన్, అన్వర్‌పాషా, శంశోద్దీన్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

వెల్దండ: మండలంలోని దుబ్బతండా, రావిచెట్టు బావితండా, పోషమ్మగడ్డతండాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ అధికారుల స్టేట్ టాస్క్‌ఫోర్స్ హైదబారాద్ టీమ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ టీమ్, డిస్ట్రిక్స్ టాస్క్‌ఫోర్స్ నాగర్‌కర్నూల్, వెల్దండ పోలీస్ టీమ్, కల్వకుర్తి ఎక్సైజ్ టీమ్ బృందాలు ప్రత్యేక దాడులు చేశారు. ఈ సందర్భంగా సారా తయారీ కేంద్రాలను గుర్తించి ధ్వంసం చేశారు. ఆయా తండాలో ప్రత్యేక తనిఖీ చేసి 1400 లీటర్ల బెల్లం ఊటకు పారబోశారు. అదే విధంగా 12 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 60 కేజీల నల్లబెల్లం, 10కేజీల పట్టికలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సారా తయారు చేస్తున్న నలుగురి వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్‌టీఎఫ్ సీఐ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, డిటీఎఫ్ సీఐ కళ్యాణ్, వెల్దండ ఎస్ఐ రవి, ఎక్సైజ్ ఎస్ఐ మురళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.